
సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం । 23 । మార్చి । 2024



ఆయిల్ పామ్..అధిక లాభం

ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు జాగ్రత్తలు తీసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని ఉద్యాన అధికారి రమేష్ తెలిపారు. - 8లో ▸



ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్ ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
$38^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి పూట ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ఆర్టీసీ సిబ్బందికి మజ్జిగ పంపిణీ



హన్మకొండ: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు వేసవి తాపం నుంచి తట్టుకునేందుకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు వరంగల్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భానుకిరణ్ తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు వేసవి కాలం పూర్తయ్యే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ సి.హెచ్.సంతోష్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి



వరంగల్ క్రైం : తనిఖీలు నిర్వహించే సమయంలో ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధి కటాక్షపూర్ ఎన్నికల చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని చెప్పారు. తనిఖీల్లో ఆత్మకూర్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లు చేస్తే కఠిన చర్యలు



వరంగల్ అర్బన్: అక్రమ లేఔట్ వెంచర్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న అన్నారు. నగర పరిధి 31వ డివిజన్ కాయంపేట రెవెన్యూ గ్రామం పరిధి 350, 351 సర్వే నంబర్లలోని భూమిలో అనుమతి లేకుండా లే–ఔట్ చేశారు. శుక్రవారం పట్టణ ప్రణాళికా విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఖలీల్ ఆధ్వర్యంలో డీఆర్ఎఫ్ సిబ్బంది, జేసీబీ డోజర్ సాయంతో వెంచర్‌లో ఏర్పాటు చేసిన మట్టి రోడ్లు, హద్దురాళ్లను తొలగించారు. వారికి నోటీసులు జారీ చేశారు.

నేడు వరల్డ్ ఎర్త్ అవర్

హన్మకొండ కల్చరల్ : పర్యవరణ పరిరక్షణే లక్ష్యంగా వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి శనివారం(నేడు) 'వరల్డ్ ఎర్త్ అవర్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వరల్డ్ వైడ్‌ఫండ్ ఫర్ నేచర్–ఇండియా, ప్రజ్వల్ ఎఫ్‌పీసీఐ, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ, యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ప్రొటెక్షన్, స్వచ్ఛ్ వరంగల్ సిటిజన్ ఫోరం, వరంగల్ వాకర్స్ అసోసియేషన్ సహకారంతో సాయంత్రం 6.30 గంటలకు హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో వరల్డ్ ఎర్త్ అవర్ నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు అన్నిలైట్లు, విద్యుత్ ఉపకరణాలు ఆఫ్ చేయనున్నారు. అలాగే ప్రజలు తమ గృహాల్లో, నగరంలోని హోటళ్లు, షాపింగ్‌మాల్‌లు, అపార్ట్‌మెంట్‌లు, ఇతర ప్రదేశాల్లో గంట పాటు ఎర్త్ అవర్ పాటించాలని ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో కోరారు.

లీడర్ గిరి..

పరపతి ఉంటే పారిశుద్ధ్య కార్మికుడూ జవానే..

- అక్రమ వసూళ్లే లక్ష్యంగా నియామకాలు
- సుమారు 200 మంది పేరుకే పారిశుద్ధ్య కార్మికులు
- అంతర్గత బదిలీ పేరిట పెద్ద ఎత్తున వసూళ్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు, పాలకవర్గం పెద్దలు





వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగానికి అవినీతి జబ్బు పట్టింది. మామ్ముళ్లు ముట్టజెప్తే ఇక్కడ సాధ్యం కాని పనంటూ లేదు. పారిశుద్ధ్య కార్మికులు రాత్రికి రాత్రే జవాన్లుగా మారిపోతున్నారు. ఇలా ఏదో ఒక్క డివిజన్‌లో కాదు. మహా నగర వ్యాప్తంగా ఉన్న 66 డివిజన్లలో ఇదే పరిస్థితి నెలకొంది. ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల అమ్మకందారులు, మటన్, చికెన్ సెంటర్లు, హోటళ్లు, ఫాస్ట్‌పుడ్ సెంటర్లు, రైతు బజార్లు, కర్రీ పాయింట్లు, బేకరీలు, తిను బండారాల తయారీదారులు, కుటీర పరిశ్రమల యజమానుల నుంచి నెలవారీ మామూళ్ల వసూలు చేయడానికి జవాన్ల సంఖ్యను అనధికారికంగా పెంచుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా.. పైరవీలను తట్టుకోలేక, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, విభాగం అధికారులు ఇష్టారాజ్యంగా జవాన్ల నియామకాలు చేపడుతున్నారు.

ఒకప్పుడు 35 మంది.. ఇప్పుడు 250

గ్రేటర్ వరంగల్‌లో నిబంధనల ప్రకారం.. 2004లో 35 మంది పర్మినెంట్ జవాన్ పోస్టులు మాత్రమే ఉండేవి. 2004, 2013లో డివిజన్ల పునర్విభజన జరిగింది. నగర పరిధి విస్తరించింది. డివిజన్లు పెరిగాయి. పారిశుద్ధ్య విభాగంలోని ఔట్‌సోర్సింగ్ కార్మికుల నుంచి సుమారు 75 మందిని జవాన్లుగా నియమించారు. వీరికి ఎలాంటి విద్యార్హత, ప్రత్యేక కమిటీ, ప్రత్యేకతలు లేకుండానే.. పెద్ద మొత్తంలో పైసలు ముట్టజెప్పిన వారికి, పరపతి కలిగిన వారిని జవాన్లుగా నియమించారు. ఇలా రాన్రానూ డివిజన్లలో 31 మంది ప్రభుత్వ జవాన్లు, 143 మంది ఔట్ సోర్సింగ్ జవాన్లుగా చెలమణిలో ఉన్నారు. పారిశుద్ధ్య విభాగంలో కార్మికుల సంఖ్య తక్కువగా ఉందని అప్పటి ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించడంతో సర్కారు అనుమతితో 452 మందిని విధుల్లోకి తీసుకున్నారు. వీరిలో చాలా మంది అప్పటి కార్పొరేటర్ల పిల్లలు, బంధువులు, రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల చొప్పున సొమ్ము చెల్లించిన వారిని ఎలాంటి నియమ నిబంధనలు పాటించకుండా విధుల్లోకి తీసుకున్నారు. వీరిలో.. దాదాపు 90 శాతం మంది వైట్ కాలర్లు. వీరు పారిశుద్ధ్య పనులు చేయడం లేదు. కానీ.. తమ ప్రజాప్రతినిధుల పేరు చెప్పుకుంటూ నెలనెలా వేతనాలు పొందుతున్నారు.

బల్దియా వివరాలు..

- నగరంలో మొత్తం పారిశుద్ధ్య కార్మికులు 3,102
- రోజూ విధులకు డుమ్మా కొడుతున్నది 400 నుంచి 500 మంది. వీరిలో నెలకు ఒక్కొక్కరి నుంచి రూ.5వేల నుంచి రూ.6వేల వరకు వసూలు చేస్తున్నారు.
- రోజూ విధులకు వచ్చే కార్మికుల నుంచి రూ.500 నుంచి రూ.1,000 వసూళ్లకు పాల్పడుతున్నారు.
- ఒక డివిజన్ నుంచి మరో డివిజన్‌కు మార్చేందుకు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు.
- ప్రధాన రహదారుల్లో పనిచేసే కార్మికులు వేల రూపాయలు చెల్లించాల్సిందే.

డివిజన్‌కు నలుగురి నుంచి ఆరుగురు..

నగర వ్యాప్తంగా 66 డివిజన్లు ఉన్నాయి. ప్రతీ డివిజన్‌లో 25 నుంచి 35 మంది పారిశుద్ధ్య కార్మికులున్నారు. వీరి పనుల పర్యవేక్షణ కోసం డివిజన్‌కు 4 నుంచి ఆరుగురి వరకు అధికారిక, అనధికార జవాన్లు విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు, సూపర్‌వైజర్లకు, అధికారులకు, ప్రజాప్రతినిధుల పేరుతో చేదోడు, వాదోడుగా ఉంటూ కాలం వెళ్లదీస్తూ నెలనెలా బల్దియా ద్వారా జీతాలు తీసుకుంటున్నారు. ప్రతి విషయంలో పారిశుద్ధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షిస్తున్న అధికారులు, సిబ్బంది జవాన్ల విధులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో వీరు ఆడింది ఆట, పాడిందే పాటగా మారిందనే విమర్శలున్నాయి.

అంతర్గత బదిలీల పేరుతో వసూళ్ల పర్వం..

గ్రేటర్ వరంగల్‌లో దశాబ్ద కాలంగా పారిశుద్ధ్య జవాన్లకు అంతర్గత బదిలీలు లేకుండా పాతుకుపోయారు. తాజాగా జవాన్ల బదిలీ ప్రక్రియకు ఆ విభాగాధికారి తెరలేపారు. దీంతో మెయిన్ రోడ్లు, కమర్షియల్ షాపులు, తమకు అనుకూలంగా ఉన్న డివిజన్ల కోసం జవాన్లు ఇంత.. అంత అనే తేడా లేకుండా డబ్బులు ముట్టజెబుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతర్గత బదిలీ పేరుతో ఓ శానిటరీ సూపర్‌వైజర్, ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పెద్ద మొత్తంలో వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అక్రమంగా ఆదాయం వచ్చే డివిజన్లు, మెయిన్ రోడ్లు, కమర్షియల్ ప్రాంతాల్లోకి అంతర్గత బదిలీల కోసం జవాన్లు రూ. 20వేల నుంచి రూ.లక్ష వరకు ముట్టజెబుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

చెరువుల కబ్జాపై నివేదిక ఇవ్వండి

ఆదేశించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

హసన్‌పర్తి: మండలంలోని చెరువుల కబ్జాపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. భీమారంలోని శ్యామల చెరువు, దేవన్నపేటలోని బంధం, చింతగట్టులోని కుమ్మరికుంట చెరువులు కబ్జాకు గురైనట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. శిఖం భూమి కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడమే కాకుండా పట్టా పాస్‌పుస్తకాలు సృష్టించి ఆ భూములను కోట్లాది రూపాయలకు విక్రయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పరిశీలించిన అధికారులు విచారణ చేపట్టారు. ఈ మూడు చెరువుల హద్దుల నిర్ధారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రెండురోజుల్లో సర్వే చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

చెరువుల పరిశీలన

ఇదిలా ఉండగా.. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం తహసిల్దార్ చల్లా ప్రసాద్, నీటిపారుదల శాఖ డీఈఈ రాజు, ఏఈ శ్రీనివాస్ ఆయా చెరువులను పరిశీలించారు. అయితే ఇప్పటికే శ్యామల చెరువు సర్వే పూర్తయిందని, నివేదిక కూడా సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 67వ బఫర్ జోన్‌లో 62 కట్టడాలు వెలిసినట్లు పేర్కొన్నారు. తనిఖీల కార్యక్రమంలో సర్వేయర్ ఎర్రపెగడ, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు కృషి

డీఎంహెచ్‌ఓ సాంబశివరావు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్

ఎంజీఎం: ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తప్పనిసరి అని, ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎంజీఎంలోని ఆకాడమీ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ఐసీటీసీ, డీసీఆర్సీ కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, టీఐఎన్జీఓలతో సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్ఓ సాంబశివరావు మాట్లాడుతూ.. జిల్లాలోని ఐసీటీసీలు, పీపీటీసీటీలు, ఏఆర్టీ క్లినిక్స్, డీఎస్ఆర్సీ సెంటర్లు, ఎస్టీఏ క్లినిక్‌లతో పాటు ఎయిడ్స్ నివారణ, నియంత్రణకు అమలవుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎంజీఎం ఏఆర్టీ సెంటర్‌లో దాదాపు 8,000 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు, హెచ్ఐవీ నివారణకు నిరంతరం సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అతిథులు.. సిబ్బందికి ట్యాబ్‌లు అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ టి.మదన్‌మోహన్‌రావు, జిల్లా క్షయ నివారణ అధికారి హిమబిందు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వప్న, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్లను చైతన్యం చేయాలి

వరంగల్ అర్బన్: ఓటర్లను చైతన్యం చేయడంలో మెప్మా పాత్ర కీలకమని అధికారులు అన్నారు. శుక్రవారం స్వీప్–24 కార్యక్రమాన్ని బల్దియా ప్రధాన కార్యాలయంలోని మెప్మా భవనంలో నిర్వహించారు. కార్యక్రమానికి మెప్మా అధికారులు హాజరై ఓటు ఆవశ్యకతను తెలియజేశారు. ఈసందర్భంగా టీపీఆర్ఓ రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ.. పౌరుల్లో ఆసక్తి పెంచి ఎన్నికల్లో భాగస్వామ్యం చేయాలని అధికారులను కోరారు. ఆర్పీలతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో టీఎంసీ రమేశ్ సీఓ శ్రీలత ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

తర్వాత ఎవరు..?

ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

- అక్రమ రిజిస్ట్రేషన్లు.. అడ్డగోలు సంపాదన
- డాక్యుమెంట్ రైటర్లే మధ్యవర్తులుగా
- సెస్పెన్షన్ గ్యాప్‌లో పోస్టింగ్‌లు



తెలంగాణ సీఎంఓ వద్దకు అక్రమ రిజిస్ట్రేషన్ల ఆగడాలు

కాజీపేట అర్బన్ : మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ దాడుల్లో సబ్ రిజిస్ట్రార్ తస్లీమా పట్టుబడగా.. ఉమ్మడి వరంగల్ జిల్లా సబ్ రిజిస్ట్రార్లు ఉలిక్కిపడ్డారు. తర్వాత ఎవరు..? అనే చర్చ జరుగుతోంది. అక్రమ రిజిస్ట్రేషన్లు, అడ్డగోలు సంపాదనకు కేరాఫ్‌గా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నిలుస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. భూక్రయవిక్రయాల దస్తావేజుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆర్థిక చేయూతి ఇవ్వాల్సిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సబ్ రిజిస్ట్రార్ల బొక్కసాలను నింపుతున్నాయి. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ రోజూ రూ.లక్షకు పైగా సంపాదిస్తున్నాడంటే పరిస్థితి ఎలా ఉందో తెలిసిపోతోంది. భూ రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయంలో అడుగుపెడితే చాలు అక్రమమైనా.. సక్రమమైనా భూస్వరూపానికి, దస్తావేజుకు ఒక్కో ధర నిర్ణయించి దండుకుంటున్నారు.

సస్పెన్షన్.. గ్యాప్‌లో పోస్టింగ్

వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏడాదిన్నర క్రితం సబ్ రిజిస్ట్రార్లు సంపత్‌కుమార్, సురేంద్రబాబు, రాంచంద్రయ్య, శ్రీనివాస్‌లు అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి పట్టుబడి సస్పెన్షన్‌కు గురయ్యారు. కొద్ది నెలల గ్యాప్‌లో అధికారుల విచారణతో తిరిగి పోస్టింగ్ కొట్టేశారు. అదే విధంగా వరంగల్ రూరల్‌లో ఓ సబ్ రిజిస్ట్రార్ అక్రమ రిజిస్ట్రేషన్‌తో సస్పెండై వరంగల్ ఆర్వో ఆడిట్ విభాగానికి బదిలీ అయ్యాడు. తిరిగి అదే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పోస్టింగ్ పొందడం చర్చనీయాంశమైంది.


భూక్రయవిక్రయ దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాలంటే సామాన్యులు జంకుతున్న పరిస్థితులు వరంగల్ ఆర్వోలో నెలకొంది. సాధారణంగా వరంగల్ ఆర్వోలో రోజూ 120 నుంచి 150 దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తవుతాయి. అయితే రెండు నెలల కాలంలో కొద్ది రోజులు 40 నుంచి 50 దస్తావేజులు మాత్రమే రిజిస్ట్రేషన్ కావడం.. సబ్ రిజిస్ట్రార్ లంచాల పర్వం అట్టే తెలిసిపోతోంది. సబ్ రిజిస్ట్రార్ల అక్రమ రిజిస్ట్రేషన్ల భాగోతం ఈనెల 21వ తేదీన తెలంగాణ సీఎంఓకు ట్విట్టర్(ఎక్స్) వేదికగా ఫిర్యాదు చేసే స్థాయికి చేరడం గమనార్హం.

డాక్యుమెంట్ రైటర్లే మధ్యవర్తులుగా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ ఉన్న డాక్యుమెంట్ రైటర్లు దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారిని పీక్కుతింటున్నారు. డాక్యుమెంట్ రైటర్లు మధ్యవర్తులుగా వ్యవహరిస్తే మాత్రం కోరుకున్న రోజే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. వారి పాత్ర వద్దనుకుంటే కొర్రీలు పెడుతూ ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.30వేల నుంచి రూ.లక్ష వరకు దండుకుంటున్నారు. వరంగల్ ఆర్వోలో సబ్ రిజిస్ట్రార్లకు ప్రత్యేకంగా వారి బంధువులే డాక్యుమెంట్ రైటర్లుగా వ్యవహరించడం గమనార్హం.

తర్జన భర్జన

- కాంగ్రెస్.. కమలం పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై మల్లగుల్లాలు
- వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎంపికపై వీడని ఉత్కంఠ
- తెరపైకి రోజుకో పేరు.. ఏటూ తేల్చలేకపోతున్న హైకమాండ్
- పార్లమెంట్ అభ్యర్థుల ఎంపిక విషయంలో తాత్సారం



సాక్షిప్రతినిధి, వరంగల్ : లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మొదలైన వెంటనే వరంగల్ ఎంపీ స్థానానికి బీఆర్ఎస్ తమ అభ్యర్థిని ప్రకటించింది. పార్టీ ముఖ్యుల్లో భేదాభిప్రాయాలున్నా.. అధినేత కేసీఆర్ ఉమ్మడి వరంగల్ నేతలతో సమావేశం ఏర్పాటు చేసి కడియం కావ్యను ఖరారు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాత్రం ఆచితూచి అడుగు వేస్తున్నాయి. అభ్యర్థులను ప్రకటించేందుకు చేపట్టిన కసరత్తు తుది దశకు చేరే సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీల్లో చేరుతుండడంతో బ్రేక్ పడుతోంది. హైదరాబాద్ తర్వాత వరంగల్ కీలక స్థానం కావడంతో బలమైన వ్యక్తులను బరిలో దింపేందుకు ఆ రెండు పార్టీలు యోచిస్తున్నందుకే తాత్సారం జరుగుతోంది. బీజేపీ ఆదివారం తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించగా.. కాంగ్రెస్ పార్టీ హోలీ తర్వాతేఅని అనడంతో అభ్యర్థుల ప్రకటన పై ఉత్కంఠ కొనసాగుతోంది.

గెలుపే లక్ష్యంగా..

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ పావులు కదుపుతున్నాయి. మహబూబాబాద్ లోక్‌సభ స్థానం విషయంలో ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాలోతు కవిత, అజ్మీరా సీతారాంనాయక్, పోరిక బలరాంనాయక్‌ను అభ్యర్థులుగా ప్రకటించాయి. వరంగల్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రకటించగా.. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. వరంగల్ పార్లమెంట్ పరిధిలో నాలుగు జిల్లాలు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే.. స్టేషన్‌ఘన్‌పూర్ మినహా ఆరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థి ఎంపిక విషయంలో వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బీజేపీ విషయానికొస్తే మొదట మాజీ డీజీపీ కృష్ణప్రసాద్, మంద కృష్ణమాదిగ తదితరుల పేర్లు వినిపించగా.. ఇటీవలే బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ కమలం గూటికి చేరడంతో సమీకరణలు, అంచనాలు తారుమారయ్యాయి. అదే విధంగా కాంగ్రెస్‌లో అద్దంకి దయాకర్ తర్వాత దొమ్మాటి సాంబయ్య, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, సింగపురం ఇందిర పేర్లను మెజార్టీ నేతలు సూచించగా.. తాజాగా వరంగల్ సిట్టింగ్ ఎంపీ, బీఆర్ఎస్ నేత పసునూరి దయాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అభ్యర్థి ప్రకటన విషయంలో తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల కమిటీ పునరాలోచనలో పడింది.

'హస్తిన'లోనే తుది నిర్ణయం.. బీజేపీలో అదే పరిస్థితి

కాంగ్రెస్ పార్టీ తరఫున వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు 64 మంది దరఖాస్తు చేసుకోగా.. అర డజన్ మందికి పైగా సీరియస్‌గా పోటీపై ఆసక్తి చూపుతున్నారు. దొమ్మాటి సాంబయ్య, సింగపురం ఇందిర, నమిండ్ల శ్రీనివాస్, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, ఎంపీ పసునూరి దయాకర్, హరికోట్ల రవి తదితరులు ఇంకా తీవ్రంగానే ప్రయత్నం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహా కొందరు మంత్రులు.. ఎమ్మెల్యేలను కలిసిన పైన పేర్కొన్న ఆశావహులందరి ఆశలను సైతం కొట్టేయడం లేదు. దీంతో ఎవరికి వారుగా టికెట్ కోసం ఆశ పడుతుండగా.. పీఈసీ మాత్రం ముగ్గురు పేర్లను ఇప్పటికే అధిష్టానానికి పంపించగా.. ఢిల్లీలో త్వరలోనే తుది నిర్ణయం జరుగుతుందంటున్నారు. ఇదిలా ఉండగా బీజేపీ నుంచి మాజీ ఐపీఎస్ అధికారి, రిటైర్డ్ డీజీపీ కృష్ణప్రసాద్, మంద కృష్ణమాదిగ, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బొజ్జపల్లి సుభాశ్‌లో ఒకరికి టికెట్ వస్తుందని భావించారు. అయితే.. ఈనెల 12న ఆ పార్టీలో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బీజేపీలో చేరారు. దీంతో ఆయనకే దాదాపు వరంగల్ టికెట్ ఖాయమన్న ప్రచారం జరుగుతోంది. దీంతో మొదటి నుంచి పార్టీలో ఉన్న వారు కాకుండా.. ఇటీవల పార్టీలో చేరిన వారికే టికెట్ ఇచ్చే పరిస్థితులు ఆ రెండు పార్టీలకు అనివార్యంగా మారాయి. ఈనేపథ్యంలో ఆశావహులు, పార్టీ కేడర్ నుంచి నిరసనలు ఎదురుకాకుండా ఉండేందుకు వారిని బుజ్జగించిన తర్వాతే అభ్యర్థులను ప్రకటించే ఉద్దేశంతో రెండు పార్టీలున్నాయి.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

- తుది జాబితా ప్రకటించిన ఎన్నికల నిర్వాహకులు
- 28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

వరంగల్ లీగల్: వరంగల్ బార్ అసోసియేషన్ నామినేషన్ల ఉపసంహరణ శుక్రవారం ముగిసింది. బార్ అసోసియేషన్ ఎన్నికలకు ఆయా స్థానాల్లో బరిలో నిలిచిన వారి తుది జాబితాను ఎన్నికల నిర్వాహకులు చిదంబర్‌నాథ్, శ్రీధర్ ప్రకటించారు. అధ్యక్షుడి బరిలో టి.జీవన్, వై.శ్రీరాఘవరావు, ఇ.వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా ఎం.జయపాల్, పి.సుదర్శన్, జనరల్ సెక్రెటరీగా ఎండీ.ముదాసిర్ అహ్మద్ ఖయ్యూమీ, పి.రమేశ్, జి.శివ, పి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ(మహిళ) కె.గోపిక రాణి, ఆర్.శిరేఖ, జాయింట్ సెకెటరీ (స్పోర్ట్స్ / కల్చరల్) ఎం.దేవేందర్, ఎస్.శివప్రసాద్, జి.వెంకటరమణ, జాయింట్ సెక్రెటరీ (లైబ్రరీ) పి.మురళీకుమార్, జె.ఉదయ్‌కుమార్, ఈసీ (20 సంవత్సరాలు) కె.రాజేందర్, పి.శ్రీనివాసరావు, ఈసీలుగా పి.అనిల్‌కుమార్, టి.అశోక్, ఎ.రాజ్‌కుమార్, ఎం.రాజు, రామకృష్ణకుమార్, జె.రవి, షేక్ అబ్దుల్ ఖలీల్ రబ్బానీ, సుధాకర్, బి.విక్రమ్, ఈసీ (మహిళ) సీహెచ్ జయశ్రీ, ఎస్.శృతి, కె.సుకన్య ఉన్నారు. ఈ 28వ తేదీన జరిగే అసోసియేషన్ ఎన్నికల్లో ఆయా స్థానాలకు ఈ అభ్యర్థులు తలపడనున్నట్లు తెలిపారు.

మూడు స్థానాలు ఏకగ్రీవం


వరంగల్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మూడు స్థానాల్లో అభ్యర్థులకు పోటీలో ఎవరూ లేకపోవడంతో ఆయా స్థానాల అభ్యర్థులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల నిర్వాహకులు తెలిపారు. జనరల్ సెక్రెటరీగా జి.హరి హరకుమార్, కోశాధికారిగా కె.శంకరాచారి, ఈసీగా సీహెచ్.సాంబశివరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి

వరంగల్ అర్బన్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో వసతి ఏర్పాట్లు చేయాలని ఎన్నికల ప్రత్యేక అధికారులు పేర్కొన్నారు. బల్దియా కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన 106–వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధి సెక్టోరల్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. మండు వేసవిలో ఎన్నికలు జరుగుతున్న దష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, నీడ కోసం షామియానాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వర్‌రావు మాస్టర్ ట్రైనర్లు సందీప్‌కుమార్, కనకయ్య, వాసు, నాగరాజు, శ్రావణ్, ఆర్ఐలు కీర్తన్, జలపతి రెడ్డి పాల్గొన్నారు.

చెత్త తరలింపు వేగంగా చేపట్టాలి

కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



వరంగల్ కరీమాబాద్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : చెత్త తరలింపులో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం ఆమె వరంగల్ పరిధి ఉర్సు, కరీమాబాద్, రంగశాయిపేట, జన్మభూమి జంక్షన్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, నీటి సరఫరా తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టడానికి ఆన్ ఆఫ్ వాల్వులు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. గార్బేజ్ నిర్వహణ ప్రణాళిక బద్ధంగా జరగాలని, చెత్తనిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. తనిఖీల్లో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈ శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, ఏఈ మోజామిల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు సాంబయ్య, వీరన్నను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ శుక్రవారం తెలిపారు. ఇసుక రవాణా చేస్తున్న క్రమంలో సదరు కానిస్టేబళ్లు.. ఓ వాహన డ్రైవర్‌పై దౌర్జన్యానికి పాల్పడారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా .. సదరు కానిస్టేబుళ్లు.. వాహన డ్రైవర్‌పై దౌర్జన్యానికి పాల్పడింది నిజమేనని నిరూపణ అయ్యింది. దీంతో ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఎవరు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వాక్యానికి భిన్నంగా కవిత్వం ఉండాలి

- ప్రముఖ రచయిత, విమర్శకురాలు కాత్యాయని విద్మహే



హన్మకొండ కల్చరల్: సాధారణ వాక్యానికి భిన్నంగా కవిత్వం ఉండాలని, లోతైన భావాలతో కవి నిరంతరం సంఘర్షణకు గురైనప్పుడే మంచి కవిత్వం వస్తుందని ప్రముఖ రచయిత, విమర్శకురాలు కాత్యాయని విద్మహే అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ స్కూల్‌లో శ్రీలేఖ సాహితి సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.రంగస్వామి అధ్యక్షతన గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కవయిత్రి డాక్టర్ బండారి సుజాత రచించిన 'వేకువ పుష్పం' కవితా సంపుటి, 'వెలుతురు చూడని యెన్నియలు' కథాసంపుటిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాత్యాయని విద్మహే ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రముఖ కవి బిల్ల మహేందర్, సింగరాజు రమాదేవి పుస్తకాల సమీక్ష చేశారు. ఈకార్యక్రమంలో కవులు అన్నవరం దేవేందర్, సత్యనారాయణ, అనిశెట్టి రజిత, పొట్లపల్లి శ్రీనివాసరావు, పి.చందు, నాగిళ్ల రామశాస్త్రి, పల్లె నాగేశ్వరరావు, గట్టు రాధిక, బాలబోయిన రమాదేవి, వల్సపైడి తదితరులు పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిపివేత

- ప్రయాణికుల ఆగ్రహం

కాజీపేట రూరల్: ముంబాయి నుంచి భువనేశ్వర్ వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్ – నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య గల చింతల్‌పల్లి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం నిలిపారు. అప్పటికే గంటన్నర ఆలస్యంతో నడుస్తున్న రైలును వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కోసం చింతల్‌పల్లి స్టేషన్ సమీపంలో అరగంట పాటు అధికారులు నిలిపివేశారు. దీంతో జనరల్ బోగి ప్రయాణికులు లోకోపైలెట్ వద్దకు వెళ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం రెండున్నర గంటల పాటు ఆలస్యంగా కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నడుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు.

మహిమాన్వితం శ్రీచెన్నకేశవస్వామి..



గుట్టపై ఉన్న దేవుని గుండం



ఉత్సవ విగ్రహం

- నేటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- 25న స్వామి వారి కల్యాణం

దామెర : మహిమాన్విత శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు నేటి (ఆదివారం) నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. కలియుగ దైవంగా భక్తులు కోర్కెలు తీర్చి కొంగు బంగారంగా వెలుగొందుతున్నాడు శ్రీ చెన్నకేశవ స్వామి. హనుమకొండ జిల్లా దామెర మండలం కోగిల్వాయి చంద్రగిరి గట్లపై కొలువున్న శ్రీ చెన్నకేశవస్వామికి వందల ఏళ్ల నాటి చరిత్ర ఉంది. చంద్రగిరి గుట్టల్లో 12వ దశాబ్దంలో కాకతీయుల ఆధ్వర్యంలో పాలన సాగినట్లు గుట్టపై చారిత్రక ఆధారాలు ఉన్నాయి. లేదళ్ల జిల్లాజి, కర్ణాలు, మాచర్ల వంశస్తులు పాలన సాగించినట్లు చరిత్ర చెబుతోంది. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన చంద్రగిరి చెన్నకేశవ స్వామి మహిమలు కలిగిన దైవంగా భక్తుల నమ్మకం. గజేంద్ర మోక్షం చంద్రగిరి గట్లపై జరిగిందని ప్రతీతి.

మూడు గుడులు, ఏడు కోనేరులు

చంద్రగిరి గట్లు కోగిల్వాయి, పులుకుర్తి, సింగరాజుపల్లి పొలిమేరల్లో విస్తరించి ఉన్నాయి. గుట్టపై శ్రీ చంద్రగిరి చెన్నకేశవ స్వామి ఆలయంతో పాటు పురాతన శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. గుట్టపై ఏడు గుండాలు ఉన్నాయి అందులో దేవుడి గుండం(పెద్ద గుండం)లో భక్తులు స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. దీంతో పాటు చాకలి గుండం, జిల్లెల్ల గుండం, హరిజన గుండం, కొత్త దేవుడి గుండం, ముని గుండం, అవుసలి గుండాలు సహజ సిద్ధంగా ఏర్పడ్డాయి.

నేటి నుంచి జాతర ప్రారంభం

ఈనెల 23 నుంచి జాతర ప్రారంభం కానుండడంతో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, డప్పు చప్పుళ్ల మధ్య గ్రామంలోని దేవాలయం నుంచి స్వామి వారు గుట్ట పైకి చేరుకుంటారు. ఈ నెల 25న హోలీ రోజున శ్రీదేవి-భూదేవి సహిత చెన్నకేశవ స్వామికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 26 నుంచి జాతర జరిగిన అనంతరం ఏప్రిల్ 7న స్వామి వారు గుట్టపై నుంచి ఊరేగింపుగా తిరిగి గ్రామంలోని ఆలయానికి చేరుకోవడంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

జాతరకు ఏర్పాట్లు పూర్తి



చంద్రగిరి గుట్టపై 15 రోజులపాటు జరిగే శ్రీ చెన్నకేశవస్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తుల సౌకర్యార్థం గుట్ట పైకి రోడ్డు నిర్మించాం. మంచి నీటి సదుపాయం కల్పించడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశాం. ప్రకృతి సహజసిద్ధ కలిగిన చంద్రగిరి గుట్టను పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలి.

-గుండ సురేష్, జాతర కమిటీ చైర్మన్

భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

- 700 క్వింటాళ్లు స్వాధీనం



పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో అధికారులు,

కాళేశ్వరం: తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు తరలిపోతున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ శశిధర్‌రాజు ఆధ్వర్యంలో పది మంది బృందం శుక్రవారం తెల్లవారుజామున జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం జాతీయ రహదారి 353(సీ) మీదుగా మహారాష్ట్రకు తరలుతున్న రెండు లారీలు, రెండు బొలెరా వాహనాలను పట్టుకున్నారు. పట్టుకున్న లారీలు, బొలేరా వాహనాలను కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులతో పంచనామా నిర్వహించారు. పీడీఎస్ బియ్యం కొయ్యూరులోని రైస్ మిల్లుకు తరలించారు. పట్టుకున్న బియ్యం సుమారు 700 క్వింటాళ్ల వరకు ఉంటుందని తెలిసింది. రెండు లారీలు, రెండు బొలెరో వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. వారి వాంగ్మూలం ఆధారంగా ఎక్కడి నుంచి ఎక్కడి తరలిపోతుందనే వివరాలను సేకరించి వారిపైనా కేసు నమోదు చేయనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. దాడుల్లో సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీలు ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, సీఐలు ప్రసాద్, లక్ష్మారెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, జంగయ్య పాల్గొన్నారు. బియ్యం పట్టుకున్నాక స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మహదేపూర్ సీఐ, ఎస్సై ఘటనాస్థలికి చేరుకున్నారు.

బీజేపీకే మాదిగల మద్దతు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

నయీంనగర్: ఎస్సీ వర్గీకరణ హామీ నిలవాలంటే మళ్లీ మోదీ పీఎం కావాలి.. బీజేపీకే మాదిగల పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని, మాదిగలకు రాజకీయ ఎదుగుదల ఉంటుందని అన్నారు. రాహుల్‌గాంధీ చుట్టూ మాలల క్యాంపు ఉందని, మాదిగలకు న్యాయం జరగదన్నారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అడ్డుగా ఉన్నారని ఆరోపించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాదిగలు ఎదగకుండా అణిచివేస్తున్నాడని, అప్పటి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య బర్తరఫ్‌కు కడియం శ్రీహరే కారణమని చెప్పారు. మాదిగలను అణిచివేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయవద్దని కోరారు. పది మంది ఎమ్మెల్యేలు ఉన్నా కేసీఆర్ మాదిగలకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. 'బీఆర్ఎస్‌లో ఎవరూ ఉండరు.. జారిపోతున్నారు. ఆ పార్టీ నుంచి పోటీ చేయడానికి అభ్యర్థులు భయపడుతున్నారు' అని పేర్కొన్నారు.

సీఐ అరెస్ట్.. రిమాండ్

- తల్లిని పెళ్లి చేసుకున్నాడు.. కూతురుపై కన్నేశాడు
- బాధితురాలి తల్లి ఫిర్యాదు.. ఏసీపీ ఆధ్వర్యంలో విచారణ



సంపత్(ఫైల్)

హసన్‌పర్తి: మైనర్‌పై అత్యాచారానికి యత్నించిన ఘటనలో ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శుక్రవారం అరెస్టయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైంలో బండారి సంపత్ సీఐగా విధులు నిర్వహిస్తున్నాడు. వర్ధన్నపేట ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో ఓ వివాహితతో ఏర్పడిన పరిచయం లైంగిక బంధానికి దారితీసింది. దీంతో సదరు మహిళ తన భర్తను వదిలిపెట్టి కొంతకాలంగా సంపత్‌తో సహజీవనం సాగించి.. తర్వాత వివాహం చేసుకున్నారు. ఆమెకు అప్పటికే పదేళ్ల వయసు కూతురు ఉంది. ప్రస్తుతం ఆ బాలిక ఇంటర్మీడియట్ చదువుతోంది. అయితే ఆ బాలికకు తండ్రిగా వ్యవహరించాల్సిన సీఐ కీచకుడిగా మారాడు. ఇటీవల అత్యాచారానికి యత్నించడంతో బాలిక తల్లి కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి విచారణ చేపట్టారు. లైంగిక దాడికి యత్నించినట్లు నిర్ధారణకు వచ్చి సీఐ సంపత్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

రెండేళ్లక్రితం సంపత్‌పై ఫిర్యాదు..

ఎస్సై బండారి సంపత్ మాయమాటలు చెప్పి తన భార్యను తీసుకెళ్లాడని రెండేళ్ల క్రితం అప్పటి పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషిని కలిసి ఆమె భర్త ఫిర్యాదు చేశాడు. అప్పుడు కాకతీయ యూనివర్సిటీ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సంపత్‌ను ఏఆర్‌కు అటాచ్ చేశారు.

ఆయిల్ పామ్.. అధిక లాభం

- ప్రస్తుత సమయంలో పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి
- లేకపోతే చేతికందని పరిస్థితి
- అన్నదాతలకు ఉద్యానశాఖ అధికారి రమేష్ పలు సలహాలు, సూచనలు



చెన్నారావుపేట: ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్న రైతులు ప్రస్తుత సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లేనిపక్షంలో పంట ఎదుగుదల, దిగుబడిలో నష్టం వాటిల్లుతుంది. మార్చి, ఏప్రిల్ నెలలో పంట పరిస్థితిని బట్టి రైతులు అధికారుల సూచనలు పాటించి సాగు చేపట్టాలి. తద్వారా అధిక లాభాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో పంట జాగ్రత్తలపై ఉద్యానశాఖ అధికారి రమేష్.. అన్నదాతలకు పలు సలహాలు, సూచనలు తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. నీటి వసతి సమృద్ధిగా ఉన్న పొలాల్లో 9 మీటర్ల దూరం ఉండేలా త్రిభుజాకార లేదా చతురస్రాకార పద్ధతిలో మొక్కలు నాటుకోవాలి. ఎదిగిన ఆయిల్ పామ్ తోటల్లో రోజూ మొక్కకు 250 లీటర్ల నీటిని అందించాలి. ఎదిగిన తోటలకు నెలకు ఎకరాకు 5 కేజీల యూరియా, 3 కేజీల డీఏపీ, 5 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను నీటిలో కరిగించి బిందు లేదా తుంపర సేద్య పరికరాల ద్వారా మొక్కలకు అందించాలి. అబ్లేషన్ సాధనంతో 3 సంవత్సరాల్లోపు వయస్సుగల తోటల్లోనూ పూల గుత్తులు తొలగించాలి. ఎదిగిన తోటల్లో ప్రతి మొక్కకు యూరియా 6 గ్రాములు, సీఎం. సూ.ఫా 940 గ్రాములు, పొటాష్ 500 గ్రాములు వేయాలి. లేదా నేల, పత్ర విశ్లేషణ సిఫారసు మేరకు ఎరువులు అందించాలి. ఎదిగిన తోటల్లో ముక్కలు చేసిన ఆకులు, మగపూలగుత్తులు, ఖాళీ గెలలతో ఆయిల్‌పామ్ పాదుల్లో మల్చింగ్ చేయాలి. ఎదిగిన తోటల్లో అల్యూమినియం కడ్డీకి కత్తిని బిగించి గెలలను కోయాలి. గెల కాడ 5 సెం. మీ మాత్రమే ఉంచాలి. పాదుల్లో దున్నొద్దు.

ఏప్రిల్ నెలలో..

లేత ఆయిల్‌పామ్ మొక్క పాదుల్లో జనుము పచ్చిరొట్ట ఎరువుగా నాటుకోవాలి. ఎదిగిన తోటల్లో రోజూ మొక్కకు 265 లీటర్ల నీటిని అందించాలి. మొక్క పాదుల్లో కలుపు నివారణకు గ్లైపోసేట్ అమోనియా లేదా పారాక్వాట్ కలుపు నాశని మందును 2.5 మి.లీ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎదిగిన తోటలకు నెలకు ఒక ఎకరాకు 5 కేజీల యూరియా, 3 కేజీల డీఏపీ, 5 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను నీటిలో కరిగించి బిందు లేదా తుంప సేద్య పరికరాల ద్వారా మొక్కలకు అందించాలి. అబ్లేషన్ సాధనంతో 3 సంవత్సరాల్లోపు వయస్సుగల తోటల్లోని పూల గుత్తులను తొలగించాలి. ఎదిగిన తోటల్లో ముక్కలు చేసిన ఆకులు, మగపూలగుత్తులు, ఖాళీ గెలలతో పంట పాదుల్లో మల్చింగ్ చేయాలి. మట్టి, పత్ర విశ్లేషణ కోసం నమూనాలు సేకరించి పంపాలి. ఎదిగిన తోటల్లో అల్యూమినియం కడ్డీకి కత్తిని బిగించి గెలలను కోయాలి. గెల కాడ 5 సెం.మీ మాత్రమే ఉంచాలి. పాదుల్లో దున్నొద్దు.

ఇద్దరు పిల్లలతో బావిలో దూకిన తల్లి

- తల్లీ, కూతురు మృతి
- ప్రాణాలతో బయటపడిన కుమారుడు
- కుటుంబ కలహాలే కారణం!



మృతిచెందిన తల్లీ కూతురు లావణ్య, నిత్యశ్రీ

నెల్లికుదురు: కుటుంబ కలహాల కారణంగా ఓ తల్లి తన కూతురు, కుమారుడితో కలిసి బావిలో దూకిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి శివారు వెంకటాపురంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల లావణ్య(30) కుటుంబ కలహాల కారణంగా మనోవేదనకు గురైంది. ఈ మేరకు తన కూతురు నిత్యశ్రీ(6), ముకేష్(10)తో కలిసి తన ఇంటి సమీపాన ఉన్న మంచినీటి బావిలో దూకింది. దీంతో లావణ్య, నిత్యశ్రీ నీట మునిగి చనిపోగా కుమారుడు ముకేష్ ఈదుకుంటూ బావిలోని పైపును పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డాడు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

బయ్యారం: మద్యానికి బానిసై మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం నర్సా తండాకు చెందిన భూక్య నాను(41) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నానూ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో ఈనెల 6న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతుండగా.. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫి ర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

రూ.19,200 లంచం తీసుకుంటుండగా పట్టివేత

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వెంకటేష్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య
- లెక్క చూపని రూ.1.72లక్షల నగదు స్వాధీనం



పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వెంకట్



పట్టించిన బాధితుడు హరీష్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వెంకటేష్ అలియాస్ వెంకట్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం చోటుచేసుకున్న ఈఘటన వివరాలను వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వెల్లడించారు. జిల్లాలోని దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన గుండగాని హరీష్.. దంతాలపల్లి మండల కేంద్రంలో 128 గజాల భూమి కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ తస్లీమా గజానికి రూ.200 చొప్పున డిమాండ్ చేయగా.. రూ.150 చొప్పున ఇస్తానని బేరం కుదుర్చుకుని వరంగల్ జిల్లా కేంద్రంలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం సాయంత్రం మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పూర్తికాగానే రూ.19,200 నగదును అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వెంకటేష్‌కు ఇవ్వమని సబ్ రిజిస్ట్రార్ చెప్పగా.. హరీష్ ఆ డబ్బులను అందజేస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వెంకట్ వద్ద లెక్క చూపని మరో రూ.1.72లక్షలు నగదు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆలేటి వెంకట్‌ను అదుపులోకి తీసుకుని వరంగల్‌లోని ఏసీబీ కోర్టుకు తరలించారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దాడుల్లో ఏసీబీ సీఐలు శ్యాంసుందర్, రాజు, సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పమా.. రాయా?



తవ్వకాల్లో బయటపడిన భారీ రాయి(శిల్పం) ఇదే



రాయి బయటపడిన ప్రదేశం (సర్కిల్‌లో)

- పురావస్తుశాఖ తవ్వకాల్లో వెలుగులోకి..
- బయటకు తీయకుండానే మట్టిని పూడ్చేసిన సిబ్బంది

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయ ఆవరణలో పురావస్తుశాఖ సిబ్బంది పైపులైన్ నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకాల్లో 5 ఫీట్ల పొడవుతో ఉన్న శిల్పం లాంటి రాయి కనిపించింది. రాయిని బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ సిబ్బందికి సాధ్యం కాలేదు. చివరికి ఉన్నతాధికారులకు సమాచారం అందించి జేసీబీ సాయంతో తీసేందుకు యత్నించగా.. శిల్పం అయితే జేసీబీ కారణంగా దెబ్బతింటుందని ప్రయత్నాన్ని విరమించుకున్నారు. రాయా.. శిల్పామా? అంటూ.. ఎటూ తేల్చుకోలేక పురావస్తు శాఖ సిబ్బంది ఆ ప్రయత్నాన్ని మానుకోని బయటపడిన రాయి పక్క నుంచి పైపులైన్ వేశారు. రాయిపై తీసిన మట్టిని యాథావిధిగా పోసి పూడ్చివేశారు. దీంతో బయటపడింది రాయా.. శిల్పామా? అంటూ పురావస్తుశాఖ సిబ్బందితో పాటు స్థానికులు చర్చించుకుంటున్నారు.

సోమసూత్రం ద్వారా నీరు బయటకు వెళ్లేందుకు పైపులైన్

'సాక్షి' కథనాలతో సోమసూత్రాన్ని పునరుద్ధరిస్తున్న కేంద్ర పురావస్తుశాఖ అధికారులు ఆలయ గర్భగుడిలో నుంచి వచ్చే నీరు (ద్రవం) ఆలయం బయటకు వచ్చేలా డ్రిల్లింగ్ పనులు చేపట్టి పూర్తి చేశారు. అక్కడి నుంచి ఆలయ ప్రాకార గోడ దాటి నీరు వెళ్లేలా సుమారు 15 మీటర్లు పైపులైన్ వేసేందుకోసం తవ్వకాలు జరిపారు. సుమారు ఫీట్ లోతుతో పైపులైన్ కోసం తవ్వకాలు జరుపుతున్న క్రమంలో రాయి కనిపించింది. గతంలో పలుమార్లు ఆలయ పరిసరాల్లో తవ్వకాలు జరిపినప్పుడు అనేక శిల్పాలు వెలుగుచూసాయని స్థానికులు పేర్కొంటున్నారు. రాయి అయినా శిల్పమైనా అధికారులు బయటకు తీయాల్సి ఉండగా తమకెందుకులే అనే రీతిలో తవ్వకాల్లో బయటపడిన రాయి (శిల్పం)పై మళ్లీ మట్టి కప్పి పూడ్చడంపై స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెలుగుచూసిన రాయిని బయటకు తీస్తే శిల్పామా? రాయా అనేది తెలుస్తుందని పర్యాటకులు పేర్కొంటున్నారు.

పలువురికి జరిమానా, శిక్ష

రామన్నపేట: లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు వరంగల్ సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.3,800 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 9 మందికి రూ.15,900 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అలాగే వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రైవింగ్ అర్హత లేని 8 మందిని గుర్తించి శుక్రవారం జువైనల్ కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేయగా.. రెండు రోజులు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

క్షుద్రపూజల కలకలం..

- వెంకటాపురంలో ఇళ్ల ఎదుట మృతుల ఎముకలు
- దర్యాప్తు చేపడుతున్న పోలీసులు



మాజీ సర్పంచ్ రమేష్ ఇంటి ఎదుట మృతుల ఎముకలతో ఏర్పాటు చేసిన కుండ, చాటా, చీపురు

పరకాల: గుర్తుతెలియని వ్యక్తులు.. ఓ ఆర్ఎంపీ, మాజీ సర్పంచ్ ఇళ్ల ఎదుట మృతుల ఎముకలతో క్షుద్రపూజలు చేశారు. ఈ ఘటన పరకాల మండలం వెంకటాపురంలో కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆర్ఎంపీ సదన్ కుమార్, ఇంటి ముందుతో పాటు మాజీ సర్పంచ్ ఇనుగాల రమేష్ కొత్త ఇంటిని నిర్మించుకుంటున్న తరుణంలో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి క్షుద్రపూజలు చేశారు. చాలా చోట్ల క్షుద్రపూజలలో కోళ్లు, మేకలకు సంబంధించిన తలలు, కోడిగుడ్లు వాడుతుండగా వెంకటాపురంలో జరిగిన క్షుద్రపూజల్లో శ్మశాన వాటిక నుంచి కుండల్లో తీసుకొచ్చిన మృతుల ఎముకలను కాల్చి పసుపు, కుంకుమతో పాటు చాటలను వారి ఇళ్ల ఎదుట ఏర్పాటు చేశారు. దీంతో ఊరికి వెళ్లి వచ్చి సరికే ఇళ్ల ఎదుట క్షుద్ర పూజలు చేసి ఉండడంతో కుటుంబీకులు, గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోకి వెళ్లడానికి కూడా సాహసించలేక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో క్షుద్రపూజలు జరిగాయా? లేక భయపెట్టేందుకు ఎవరైనా ఆకతాయిలు కావాలనే నాటకం ఆడారా? అనే విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.